## కాంగ్రెస్ హామీల అమలుకు

# కౌంట్‌డౌన్ షురూ



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

- వెంటాడుతాం.. పోరాడుతాం..
- ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- ఇది చిన్న విరామం మాత్రమే
- ఆ తర్వాత రెట్టించిన వేగంతో ముందుకెళ్తాం
- 2 శాతం ఓట్ల తేడాతోనే కాంగ్రెస్ గద్దెనెక్కింది
- అధర్మరం, మోసంతో గెలిచిన పార్టీ ఎక్కువ రోజులు నిలవవు... ధర్మమే గెలుస్తుంది
- బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబర్ 7 : ఆచరణ సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను అయోమయానికి గురిచేసి గద్దెనెక్కిందని, హామీల అమలుకు శుక్రవారం నుంచే కౌంట్‌డౌన్ షురూ అయ్యిందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలన్నీ మార్చి 7వ తేదీ వరకు నెరవేర్చాలని, లేదంటే వెంటాడుతామని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ఆయన గురువారం మొదటిసారి నియోజకవర్గానికి వచ్చారు. వేల్పూర్‌లోని తన నివాసంలో తనను కలిసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 15 సంవత్సరాల పాటు సుధీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన పార్టీ మనదన్నారు. చావు నోట్లో తల పెట్టి రాష్ట్ర ఏర్పాటు కోసం దేశ రాజకీయాలను ఒప్పించి, రాజకీయ అనివార్యత సృష్టించిన నాయకుడు కేసీఆర్ అన్నారు. అలా సాధించుకున్న రాష్ట్రాన్ని కేసీఆర్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారన్నారు. 50 ఏండ్లలో చేయని అభివృద్ధిని తొమ్మిదిన్నరేండ్లలో చేసి చూపిన నాయకుడు కేసీఆర్ అన్నారు. కరెంటు, సాగునీటి తిప్పలు లేకుండా చేశాడన్నారు. అన్నదాతకు పెట్టుబడి కోసం ఇబ్బందులు లేకుండా ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా పెట్టుబడి సాయాన్ని కేసీఆర్ ప్రవేశపెట్టారన్నారు. పేదలకు రెండు వందల పింఛన్లను రెండు వేలకు పెంచి ఇచ్చారని, దేశంలో ఎక్కడా ఇది లేదన్నారు. ఆడబిడ్డ పెండ్లయితే లక్ష రూపాయల కల్యాణలక్ష్మి చెక్కులను అందించారన్నారు. కాంగ్రెస్ నాయకులు కేసీఆర్, తనపై ఆరోపణలు గుప్పిస్తూ ప్రజలను అయోమయానికి గురి చేశారన్నారు. రెండు శాతం ఓట్ల తేడాతోనే కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేసేదాక ప్రజల పక్షాన పోరాడాల్సిన అవసరముందని, ఎవరూ కుంగిపోనవసరం లేదన్నారు. రైతు బంధు, రుణమాఫీ వంటి అంశాలను మూడు నెలల్లో అమలు చేస్తామని ప్రకటించారని.. రేపటి నుంచి కౌంట్‌డౌన్ స్టార్ట్ అని.. మార్చి ఏడో తారీఖులోపు రెండు లక్షల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేయాల్సిందేనన్నారు. మహిళలకు బస్సు ఫ్రీ, కరెంట్ బిల్లు, రూ. లక్ష కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, సిలిండర్ రూ.500, ప్రతి మహిళకు 2,500 వంటి మ్యానిఫెస్టోలోని అంశాలను రేపటి నుంచే అమలు చేస్తామన్నారని గుర్తు చేశారు. హామీలను నెరవేరిస్తే సహకారం అందిస్తామని.. ఎగ్గొడితే పోరాటం చేస్తామన్నారు. గ్రామానికి పోయినా మీరు తలెత్తుకుని నిలబడి మాట్లాడేలా కేసీఆర్ అభివృద్ధి చేసి చూపాడన్నారు.. ఎవరికీ తల దించాల్సిన పని లేదని, ధైర్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ మితిమీరిన వేషాలు వేస్తే ప్రజలకు అర్థం అవుతుందన్నారు. ఇది విరామం, స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని తెలిపారు. ఇంతకు రెట్టింపు వేగంతో వెళ్తామన్నారు.

# సైనికుల త్యాగాలను గుర్తు చేసుకోవాలి



సాయుధ దళాల పతాక దిన్సోవ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీ ప్రారంభం



నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 7 : సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంతీయ సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి చేపట్టిన ర్యాలీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ సైనికులు, సైనికులు, వారి కుటుంబాల కోసం ఉద్దేశించిన సహాయనిధికి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆర్మీ అధికారులు, సిబ్బంది జిల్లా పాలనాధికారి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి గౌరవ వందనం సమర్పించారు. అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డితో పాటు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు సైనిక సంక్షేమ నిధికి తమ వంతుగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సాయుధ దళాలకు చెందిన సైనికులు తమ ప్రాణాలను లెక్క చేయకుండా రేయింబవళ్లు శ్రమిస్తున్నారని, వారి కృషి వల్లే మనమంతా ప్రశాంత వాతావరణంలో దైనందిన జీవనం వెళ్లదీస్తున్నామన్నారు. సైనికుల త్యాగాలను ప్రతి పౌరుడు గుర్తిస్తూ వారి పట్ల.. వారి సేవల పట్ల గౌరవభావంతో మెలగాలని, సాయుధ దళాలకు మద్దతుగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి రమేశ్, కెప్టెన్ బాబూరావు, సుబేదార్ రామేశ్వర్, మల్కిట్‌సింగ్, ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు మోహన్, దివాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు, సైనిక్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు టి.వీరేశం ఆధ్వర్యంలో సైనికులను ఘనంగా సన్మానించారు.

### శుభాకాంక్షల వెల్లువ..



బాన్సువాడ ఎమ్మెల్యేగా మరోసారి భారీ మెజారిటీతో గెలిచిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువ కొనసాగుతున్నది. నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనను కలిసేందుకు వచ్చిన వారందరికీ ఈ సందర్భంగా పోచారం ధన్యవాదాలు తెలిపారు.

–బాన్సువాడ, డిసెంబర్ 7




### హరితవనంలా బాల్కొండ సీహెచ్‌సీ





నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ( సీహెచ్‌సీ) హరితవనాన్ని తలపిస్తున్నది. ఏపుగా పెరిగిన చెట్లు దవాఖానకు వచ్చే రోగులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

-నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

